క్లుప్తంగా

చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ఏఈఈ

పాలకుర్తి: మండలంలోని ఉండేడ గ్రామ శివారులోని బొట్లకుంట చెరువును మండల ఇరిగేషన్ ఏఈఈ ఝాన్సీరాణి పరిశీలించారు. చెరువులో నుంచి 1000 క్యూబిక్ మీటర్ల పూడి కమట్టిని తీసుకెళ్లేందుకుగాను ఓ వ్యక్తికి పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. విషయం తెలిసిన గ్రామ గంగపుత్ర సంఘం సభ్యులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి మట్టితీత పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈఈ ఝాన్సీరాణి అనుమతులు లేకుండా మట్టి తరలింపు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే ఉండేడ గ్రామాన్ని ఇటీవల నూతన మండలంగా ఏర్పాటైన ఎండపల్లిలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల గెజిట్ విడుదల చేసింది. ఈనేపథ్యంలో అనుమతుల కోసం వెల్గటూర్ మండల ఇరిగేషన్ అధికారులకు అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



9వ వార్డులో స్వచ్ఛశుక్రవార్ లో కౌన్సిలర్

పెద్దపల్లిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యంగా ఉండగలుగుతామని ప్రజలంతా తమ ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని 9వ వార్డు కౌన్సిలర్ ఎరుకల కల్పన కోరారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా శుక్రవారం డ్రెయినేజీలను శుభ్రం చేయించడంతో పాటు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేపట్టారు. నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుండారం పంప్‌హౌజ్ సందర్శన



పంపుహౌజ్ వద్ద కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ సమీపంలోని టూ టీఎంసీ పైపులైన్ పంప్‌హౌజ్ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ముత్తారం మండలంలోని చివరి ఆయకట్టుకు పైపులైన్‌తో సాగునీరు అందించాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు. తమ మండల పరిధిలో సాగు చేసిన పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ముత్తారం, కమాన్‌పూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ. భూంపెల్లి రాజయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ వైనాల రాజు, రైతులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శ్రవణ్ కుమార్

రామగిరి : ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం శ్రమించాలని మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శిక్షకుడు బోయిని శ్రవణ్ కుమార్ సూచించారు. పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు నిర్వహించారు. విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు అధైర్యపడవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో కమల, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

పెద్దపల్లిరూరల్ : పెద్దపల్లి మండలం కాపులపల్లిలో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారి (మండల ప్రత్యేక అధికారి) మైఖేల్ బోస్ పరిశీలించారు. ఉపాధిహామీ పథకం కింద పనులు చేపట్టి కూలీలకు అవకాశం కల్పించాలని సూచించారు. పారిశుధ్యం నర్సరీల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, తదితరులు ఉన్నారు.

జీపీలకు పక్కా భవనాలు

- మండలంలో 12 గ్రామాలకు నిధులు మంజూరు
- ఉపాధి హామీలో ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు
- పంచాయతీలకు తీరనున్న అద్దె భారం



అద్దె భవనంలో నారాయణరావుపల్లి గ్రామపంచాయతీ

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు అని చెబుతారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అంటారు. గ్రామాల్లో పాలన విధానంతో పాటు ప్రజలు అన్ని సదుపాయాలు కల్పించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. కానీ సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక పంచాయతీ పాలకవర్గాలు ఇన్ని రోజులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో సరైన పంచాయతీ కార్యాలయాలు లేక పాలన కొనసాగించడంతో పాటు సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో , ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గదుల్లో పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యాలయాలు ఏళ్లక్రితం నిర్మించినని కావడంతో అవి శిథిలావస్థకు చేరాయి. పంచాయతీకి సంబంధించి ఏ సమావేశం, సభలు నిర్వహించుకోవాలన్నా చాలా ఇబ్బందులు పడేవారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో పాలకవర్గాలు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు తమ గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు కావాలని ప్రభుత్వానికి ఎన్నో సార్లు విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామపంచాయతీ భవనాలు నిర్మించాలని, దానికి ఒక్కో భవనం కొనం రూ.20 లక్షలు కేటాయిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. దీంతో సుల్తానాబాద్ మండలంలోని 27 గ్రామాలకు గాను 12 గ్రామాల్లో పంచాయతీలకు పక్కా భవనాల కోసం నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు

సుల్తానాబాద్ మండలంలోని 12 గ్రామాలకు కొత్త పంచాయతీ భవనాలు నిర్మించుకునేందుకు ఒక్కో భవనానికి రూ. 20 లక్షల నిధులు కేటాయించారు. నిధులు కేటాయించిన గ్రామాల్లో అల్లీపూర్, భూపతిపూర్, చిన్నబొంకూర్, దుబ్బపల్లి, గర్రెపల్లి, కందునూరిపల్లె, కాట్నపల్లి, రేగడిమద్దికుంట, సుద్దాల, దేవునిపల్లి, నారాయణరావుపల్లి, రామునిపల్లి ఉన్నాయి. దీంతో నూతన భవనాలు పూర్తయితే గ్రామస్తులకు అన్ని రకాల సేవలు అందుబాటులో అందుతాయి. వెంటనే నూతన భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతగా నిర్మించుకోవాలి



ఉపాధిహామీలో మంజూరైన నిధులతో పాలన సౌలభ్యం కోసం విశాలంగా ఉండేలా భవనాలను నిర్మించుకోవాలి, ఎంపికైన గ్రామాల్లో పనులు ప్రారంభించిన త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా నిర్మించుకోవాలి.

– శశికళ ఎంపీడీవో, సుల్తానాబాద్

చాలా ఇబ్బంది పడుతున్నాం



పక్కా భవనం లేక అద్దె భవనంలో నడిపిస్తున్నాం . సాధారణ సమావేశాలు, గ్రామసభలు నిర్వహిస్తున్నప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నాం. నూతన భవనం కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే, ఎంపీపీలకు ప్రత్యే కృతజ్ఞతలు.

– వెంకటలక్ష్మి, సర్పంచ్, నారాయణరావుపల్లి

క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామీణ క్రీడలకు విశేష ఆదరణ పెరిగిందన్నారు. అనంతరం మాట్లాడుతూ విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మొదటి విజేతగా నిలిచిన మహబూబ్‌పల్లి జట్టుకు రూ.40వేలు, మెమెంటో, రెండో స్థానంలో నిలిచిన గట్ల నర్సింగాపూర్ జట్టుకు రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన చెక్కపల్లి జట్టుకు రూ.20వేలు, మెమొంటో, నాలుగో స్థానంలో నిలిచిన హుజురాబాద్ జట్టుకు రూ.పదివేలు అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీపీ గిరిప్రసాద్, వన్‌టౌన్ సీఐ రమేష్‌బాబు కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, కొమ్ము వేణుగోపాల్, పాముకుంట్ల భాస్కర్, బాల రాజ్‌కుమార్, విజయచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళారంగానికి పుట్టినిల్లు రామగుండం

రామగుండం పారిశ్రామిక ప్రాంతం కళా రంగానికి పుట్టినిల్లని తమ ప్రతిభను చాటి ఈ ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ప్రధాన చౌరస్తాలో జరిగిన సినీ హీరో నాని జన్మది వేడుకల్లో పాల్గొన్నారు. వీర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ దసరా సినిమాకు దర్శకత్వం చేయడం మనందరికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, దర్శకుడు ఓదెల శ్రీకాంత్, జబర్దస్త్ ఫేమ్ కొమురక్క, కార్పొరేటర్లు సదానందం, భాస్కర్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

అనారోగ్యంతో బాధపడుతున్న పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామానికి చెందిన పొన్నం సత్తమ్మకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం రూ. 1 లక్ష విలువగల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్, నాయకులు రావుల సాగర్ ఉన్నారు.

వేతన సవరణ చేపట్టాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగానే శుక్రవారం రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ వేతన సవరణతో పాటు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చడం, ఆర్టిజన్లకు పర్సనల్ పే బేసిక్‌లో కలుపడం, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ తదితర డిమాండ్ల సాధనకు నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు లగిశెట్టి రవికుమార్, బొడ్డు యాదగిరి, జాగటి శ్రీకాంత్, నూనె రాజేందర్, ఎండీ.సలీం, గుర్రాల నర్సింహులు, టంగుటూరి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనుదీప్ మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు, వైద్యం గురించి వివరించారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతున్నందునా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన వారికి విపరీతంగా తెమడతో కూడిన దగ్గు, దమ్ము వస్తుందన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే తెమడ పరీక్షలు చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుందన్నారు. పాజిటివ్ వచ్చిన వారు కేవలం ఆరు నెలలు కోర్సు వాడితే పూర్తిగా నయం అవుతుందన్నారు. నిర్లక్ష్యం చేయకుండ వ్యాధి లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఛాయాదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జయ, దామోదర్‌రెడ్డి, మల్లేశం, ఏఎస్ఎం జ్యోతి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు చట్టాలు అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లు


గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జీడీకే-5 ఓసీపీలో పనిచేస్తున్న బొలేరో, క్యాంపర్ కాంట్రాక్టు డ్రైవర్లతో కలిసి ఆందోళన నిర్వహించారు. చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్ డ్రైవర్లు వేతనాలు నడుపుతున్నారన్నారు. పని భద్రత లేదని, కార్మిక చట్టాలను అమలు చేయకుండా, వాహన యజమానులు శ్రమ ,ఆర్థిక దోపిడీ చేస్తున్నారన్నారు. యజమాన్యం చెల్లిస్తున్న డ్రైవర్ల జీతాలు కొర్రీలు లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ప్రతినెల మొదటి వారంలో జీతాలు చెల్లించాలని, డస్ట్ అలవెన్స్ చెల్లించాలని, ప్రతి ఏటా రెండు జతల డ్రెస్సులు, రెండు జతల షూస్, ఒక హెల్మెట్ ఇవ్వాలన్నారు. ప్రతినెలా బోనస్ చెల్లించాలని, కార్మికులందరికీ సీఎంపీఎఫ్ ఇతర అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి జెడ్పీటీసీ సంధ్యారాణి మద్దతు తెలిపారు. డ్రైవర్ల సమ్మె న్యాయమైంని, సింగరేణి యజమాన్యం జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కరీం, మహమ్మద్ యాకూబ్ ఫిరోజ్, ఖాజా జఫరుద్దీన్, యహగ్రీవ చారి, ఆనంద్ శేఖర్, యాసీన్, శ్రావణ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

గోదావరిఖని: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేశ్ థియేటర్ ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌లో గుర్తు తెలియని(70) ఏళ్ల వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న వృద్ధుడు బస్‌షెల్టర్‌లోని బెంచీపై మృతి చెంది ఉన్నాడు. మృతికి సంబంధించి సమాచారం తెలిస్తే 87126 56516 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ రమేశ్ బాబు కోరారు.

రైతులు, మహిళలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ సర్కారు

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



విజయరమణారావుకు బొట్టు పెడుతున్న మహిళ

ఎలిగేడు: రైతులు, మహిళలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మండలంలోని నారాయణపల్లిలో, మండల కేంద్రంలో శుక్రవారం హాథ్ సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడప, గడపకు కాంగ్రెస్ పార్టీ, పల్లె,పల్లెకు విజ్జన్న 3వ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఇప్పటివరకు ఎలిగేడు, నారాయణపల్లికి ఎన్ని డబుల్‌బెడ్‌రూంల ఇళ్లను నిర్మించి ఇచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ హయాంలో రేషన్ షాపుల్లో 9 రకాల నిత్యావసర సరుకులు ఇచ్చారని, ఇప్పుడు కేవలం బియ్యం తప్పా..నిత్యావసర సరుకులు ఇయ్యలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, వేముల రామ్మూర్తి, కోరుకంటి వెంకటేశ్వర్ రావు, మినుపాల స్వరూపారాణి, ప్రకాశ్‌రావు., దన్నాయక్ దామోదర్‌రావు, కొండా తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కమిటీలు ఏర్పాటు చేయాలి



రామస్వామిని సన్మానిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: అన్ని గ్రామాల్లో మున్నూరు కాపు సంఘాల కమిటీలను ఏర్పాటు చేసి కాపు సంఘాలను అభివృద్ధి చేయాలని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని కాపు సంఘ భవనంలో శుక్రవారం కాపు కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ కమిటిలతో పాటు మండల కమిటీని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల శ్రీనివాస్, కట్కం రవీందర్, నీలం శ్రీనివాస్ ఆకుల బాపు, అంబీరు శ్రీనివాస్, దండె కనుకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



యైటింక్లయిన్ కాలనీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అల్లూరు శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ సంతోషిమాత దేవీ అమ్మ వారు ప్రాణ ప్రతిష్ఠాపన జరిగి ఒక ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా పండితులు శ్రీ రామోజుల దామోదర్ శర్మ, పానుగంటి విజయ్ శర్మ, ప్రశాంత్ మహరాజ్, శుక్ల రఘు మహరాజ్, పవన్ మహరాజ్ ల మంత్రోచ్చారణల మధ్యన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేసి అమ్మావారికి 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గండి వసంతలక్ష్మి–సదానందం దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ సంతోషిమాత భక్తజన బృందం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రామగిరి:సెంటినరీకాలనీలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలతో వేడుకలు ముగిశాయి. బేగంపేటకు చెందిన గుండ స్వరూప, సత్తయ్య దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీచైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, కమిటీ సభ్యులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్న శ్రీ లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి త్రయాహ్నిక చతుష్కుండాత్మక తృతీయ పుష్కరోత్సవ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య అరుణ్ కుమార్ రూ.10 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

రామగిరి: మండలంలోని పన్నూరులో శుక్రవారం అమ్మవారి బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పోచమ్మ కొలుపు ఉత్సవాల్లో భాగంగా భూదేవి సహిత శ్రీ మహాలక్ష్మీ బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ చేసిన గ్రామస్తులు అమ్మవారి బోనాల జాతరను నిర్వహించారు.పెద్దపోచమ్మ, చిన్న పోచమ్మ ఆలయాలలో నైవేద్య సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేదరవేని శారద, రైతుబంధు మండల కన్వీనర్ మేదరవేని కుమార్ యాదవ్, వైస్ ఎంపీపీ కాపరబోయిన శ్రీదేవి, సర్పంచ్ అల్లం పద్మ, ఎంపీటీసీ చిందం మహేష్, ఉప సర్పంచ్ దామెర శ్రీనివాస్,ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ ధ్వంసంపై ఫిర్యాదు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునీర్, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ మండల కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు తమ ఫిర్యాదుపై స్పందించి దర్యాప్తు చేయాలని కారకులను గుర్తించి చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాజనవేన సదయ్య, కల్వల శ్యాం, దేవేందర్, శ్రీనివాస్, గోవర్ధన్, విష్ణు, రాజిరెడ్డి, సాగర్, ప్రశాంత్ ఉన్నారు.

‘బండి’ కి ఘన స్వాగతం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మంథని నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దపల్లి మీదుగా వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ వివేక్ కు పెద్దపల్లిలో శుక్రవారం నాయకులు స్వాగతం పలికారు. బీజేపీ కౌన్సిలర్ రాజం మహంత, తూముల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మంథని: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ప్రజా సంగ్రామ యాత్ర మొదటి విడత ముగింపు సభలో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ వివేక్‌కు మంథనిలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. సంజయ్‌తో పాటు స్వాగతం పలికిన వారిలో పట్టణ శాఖ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, ప్రధాన కార్యదర్శి సబ్బని సంతోష్, నాయకులు కొండపాక సత్యప్రకాశ్, బోగోజు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు?

గోదావరిఖని: వరదలకు కొట్టుకుపోయిన రోడ్డును నిర్మించడంలో జాప్యం చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ విమర్శించారు. జనగామ గ్రామంలో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. పట్టణానికి అతిచేరువలో ఉన్న జనగామ గ్రామం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ముగ్గురు కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, ఎమ్మెల్యే పర్యటించినప్పటికి ఈప్రాంతంలో సమస్యలు పరిష్కరించలేదన్నారు. వరదలకు కొట్టుకుపోయిన రోడ్డును మరమ్మతు చేయడంలో జాప్యం జరుగుతోందని, దీంతో గోదావరినదికి, పొలాలకు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జనగామ మండలశాఖ అధ్యక్షుడు జనగామ రాజలింగు, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, మారం వెంకటేశ్, సోమారపు లావణ్య, పిడుగు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలి

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్‌లో పనిచేస్తున్న కార్మికులు ఈఎస్ఐ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం, సైట్ ఇన్‌చార్జ్ సుధీర్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం రామగుండం ఈఎస్ఐసీ బ్రాంచ్ మేనేజర్ డి.ఖగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో కార్మికులకు బేసిక్ లైఫ్ సపోర్ట్ ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్ కుమార్ ఝా పాల్గొన్నారు. అనంతరం ఈఎస్ఐ యొక్క ప్రయోజనాలు, సౌకర్యాలపై కార్మికులు అడిగినా పలు సందేహాలకు సమాధానం ఇచ్చారు. డాక్టర్ అంజనయ్య మొట్టి, ఈఎస్ఐసీ సభ్యులు బి.మోహన్, మహేందర్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పక వేయించాలి

ఎలిగేడు: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందును మేకలకు, గొర్రెలకు తప్పక వేయించాలని మండల వెటర్నరీ వైద్యురాలు ఝాన్సీ అన్నారు. శుక్రవారం ఎలిగేడు మండలంలోని నర్సాపూర్‌లో 1520 గొర్రెలకు నట్టల నివారణ మందును వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు తంగెళ్ల స్వప్న, గోపాల మిత్ర పెద్ది సమ్మయ్య, గొర్రె, మేకల పెంపకం దారులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని బేగంపేటలో మండల పశువైద్యాధికారి డాక్టర్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు సర్పంచ్ బుర్ర పద్మ వేశారు. మండలంలోని కల్వచర్ల, లొంకకేసారం గ్రామాల్లో నేడు నట్టల మందు పంపిణీ చేయనున్నట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నారాయణ, అత్తె మల్లికార్జున్, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో పశువులకు డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో నట్టలనివారణ మందులను శుక్రవారం పంపిణీ చేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్క మల్లారెడ్డి, ఎంపీటీసీ గోపు లావణ్య పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: సింగరేణి ప్రభావిత గ్రామాల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు అందించేందుకు ఆదివారం సింగరేణి ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూ మారేడుపాకలో జిల్లా పరిషత్ పాఠశాలలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణి ప్రభావిత ప్రాంతమైన వీర్లపల్లి, న్యూ మారేడుపాక, అల్లూరు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి ప్రభావిత వీర్లపల్లి గ్రామ పరిరక్షణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్చి 6న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా

రామగుండం: హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట మార్చి ఆరో తేదీన నిర్వహించే మహాధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక రైల్వే ఆర్‌వోహెచ్‌షెడ్‌లో కార్మికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రతినిధి రామాచారి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల జీవో జారీ చేయాలని, ఫైనల్ నోటిఫికేషన్ పూర్తయిన కాంట్రాక్టు కార్మికుల జీవో విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకు కార్మికులతో ధర్నా తలపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు తుంగపిండి మల్లేశ్, రైల్వే కాంట్రాక్టు కార్మిక నాయకుడు బొంకూరి మహేశ్, సందీప్, సురేష్, వర్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.